ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

3

శుక్రవారం 26 సెప్టెంబరు 2025



గ్రావెల్‌ను టిప్పర్లకు నింపుతున్న దృశ్యం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం సంపద పెంచి దాన్ని సంక్షేమ పథకాల పేరుతో పేదలకు అందిస్తోంది. అయితే కడపలో కొందరు నేతలు మాత్రం ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ జేబులు నింపుకుంటున్న వైనం ఇప్పుడు బయటకు వస్తోంది. మట్టి నుంచి మనీ తీసుకుంటూ రోజూ లక్షలాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. అదేదో జిల్లా మారుమూల ప్రాంతమో, సరిహద్దు ప్రాంతమో కాదు.. జిల్లా కేంద్రమైన కడపకు కూతవేటు దూరంలోనే గ్రావెల్ రూపంలో దోపిడీ జరుగుతుండడం గమనార్హం. ఎంతగా అంటే.. రోజుకు దాదాపు రూ.7లక్షలు అక్రమార్కులు జేబుల్లోకి పోతోంది.

కొల్లగొట్టారు..!

- ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- రోజూ అక్రమార్కుల జేబుల్లోకి రూ.లక్షల సొమ్ము

(కడప-ఆంధ్రజ్యోతి): నగర శివారులో ఉన్న చిన్నచౌకు రెవెన్యూ పొలంలోని నానాపల్లె సమీపంలో రెండురోజుల క్రితం గ్రావెల్ క్వారీ వద్ద జరిగిన వీరంగం ఇప్పుడు కడపలో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ ఇష్యూతో గ్రావెల్ మాటున నానాపల్లె సమీపంలో జరుగుతున్న అక్రమాల వ్యవహారం బహిర్గతమైంది. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతి ఇప్పటికే పలుమార్లు కథనాలు ప్రచురించింది. కొద్దిరోజులు సైలెంట్‌గా ఉండడం, మరలా షరా మామూలుగా ఇక్కడ అక్రమంగా మట్టి తవ్వడం జరుగుతోంది.

ఇష్టారాజ్యంగా తవ్వేశారు

చిన్నచౌకు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 919/1పీలో గ్రావెల్ తవ్వకాలకు భూగర్భగనులశాఖ అనుమతి ఇస్తుంటుంది. ప్రస్తుతం అక్కడ 8 క్వారీలు ఉండగా, 6 పనిచేస్తున్నట్లు భూగర్భగనుల శాఖ అధికారులు చెబుతున్నారు. సర్వే నెంబర్ 919/1లో గ్రావెల్ తవ్వకాల కోసం కె.రామక్రిష్ణ అనే వ్యక్తికి రెండు ఎకరాలు లీజు ఇచ్చారు. 27 అక్టోబర్ 2027 వరకు గడువు ఉంది. ఇక సర్వే నెంబర్ 919/1పీలో జి.చెన్నారెడ్డికి 1.762 హెక్టార్లు ఇచ్చారు. ఇది ఈ ఏడాది జూన్ 9కి ముగిసింది. సర్వే నెంబర్ 919/1పీలో ఓ.బాలకొండయ్యకు 3.998 హెక్టార్లు లీజుకు ఇచ్చారు. 13 ఆగస్టు 2030 వరకు అనుమతులున్నాయి. సర్వే నెంబర్ 919లో సింగారెడ్డి శివమ్మకు 4.628 హెక్టార్లు ఇచ్చారు. ఇది 23 నవంబర్ 2032 గడువు ఉంది. సర్వే నెంబర్ 919/1పీలో సాయివినీల ఏజెన్సీకి 4.36 హెక్టార్లు కేటాయించారు. 23 ఫిబ్రవరి 2032 వరకు గడువు ఉంది. సర్వే నెంబర్ 919/1లో ఎం.రాధికకు 4.864 హెక్టార్లు కేటాయించారు. 4 మార్చి 2030 వరకు గడువు ఉంది. యల్లారెడ్డికి 919/1పీలో 4.466 హెక్టార్లు కేటాయించారు. 20 జూన్ 2030 వరకు గడువు ఉంది. అయితే ఇక్కడ చెన్నారెడ్డి, ఓ.బాలకొండయ్యకు చెందిన మైన్స్ మాత్రమే లైవ్‌లో ఉన్నాయి. ఇవి కూడా వేరేవాళ్లు లీజుకు తీసుకున్నట్లు చెబుతున్నారు. మిగతా లీజులన్నీ కొందరు పాత బకాయిలు, ఇతరత్రా పెనాల్టీ చెల్లించకపోవడం, మరికొందరు తమకు మైనింగ్ వద్దంటూ అధికారులకు లిఖితపూర్వకంగా తెలపడంతో ఇవన్నీ మనుగడలో లేవు. ప్రస్తుతం రెండు మాత్రమే పనిచేస్తున్నాయి.

అడ్డగోలుగా తవ్వకాలు

గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. భవనాల నిర్మాణం, లేఅవుట్లు ఇతరత్రా వాటికి గ్రావెల్ అవసరం. టిప్పరు దూరాన్ని బట్టి రూ.4,500 నుంచి రూ.7వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక 14 క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌కు రూ.2025 ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సి ఉంది. కేటాయించిన చోటే తవ్వుకోవాలి. ఇక్కడ కొందరు కేటాయించిన చోట కాకుండా పక్కన తవ్వుతున్నట్లు చెబుతున్నారు. కాగా గ్రావెల్ రాయల్టీని ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించింది. అక్రమంగా తవ్వుతుంటే వారిని పట్టుకుని ఫైన్ వేస్తారు. అయితే ఇక్కడ అక్రమంగా మైనింగ్ చేసే కొందరు ఆన్‌లైన్‌లో రాయల్టీ కట్టకుండా మాన్యువల్‌గా రూ.800 చెల్లించే విధంగా పర్మిట్ తీసుకున్నారు. మరికొందరు ఒక్కోసారి అసలు రాయల్టీ చెల్లించకుండానే అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. అక్కడ టిప్పరుకు లోడు చేసినందుకు రూ.3500 తీసుకుంటారు. రోజూ అడ్డగోలుగా తవ్వేసి వందకు పైగా టిప్పర్ల ద్వారా తరలిస్తూ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండా సొమ్ము చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అక్రమార్కులకు సహకరిస్తుండటం గమనార్హం.



గ్రావెల్‌తో వెళుతున్న టిప్పర్

త్వరలో 1050 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు

- కడప బస్టాండుకు రూ.1.30 కోట్లతో సీసీ రోడ్డు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



కడప ఆర్టీసీ గ్యారేజీ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న బస్సులకు అదనంగా మరో 1050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. గురువారం కడప గ్యారేజీని ఆర్టీసీ ఎండీతో పాటు ఈడీఈ చెంగల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజీ, బస్టాండు స్థితిగతులను గురించి కడప ఆర్ఎం గోపాల్‌రెడ్డి, ఇతర అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణాన్ని పూర్తిగా సిమెంటు రోడ్డుతో తీర్చిదిద్దేందుకు అనువుగా రూ.1.30 కోట్లుతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గతంలో వర్షాలు కురిస్తే ఆర్టీసీ బస్టాండు ఆవరణ మొత్తం మోకాటిలోతు నీటితో ఉండేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. స్త్రీశక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. అందుకనుగుణంగా అన్ని బస్టాండ్లలో ప్రయాణికుల కోసం కుర్చీలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం మరింత నాణ్యతతో ఉండేలా చూస్తామన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలు ఎంతో ఓర్పు, సహనంతో ఉన్న తీరు అభినందనీయమన్నారు. ఆ కోవలో ప్రయాణం చేసే మహిళలు, ఇతరుల పట్ల ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు ఎంతో మర్యాదపూర్వకంగా బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. గ్యారేజీ సిబ్బంది సైతం అంకితభావంతో సేవలందించాలని, సమయపాలన తప్పక పాటించి ప్రజల మన్ననలు అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎ ఢిల్లీశ్వర్‌రావు, ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు కేకే కుమార్, ఎం.పురుషోత్తం, ఏఆర్ మూర్తితో పాటు పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సుస్థిర ఆదాయం వచ్చేలా చేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో సుస్థిర ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కేంద్ర, గ్రామీణాభివృద్ధి వ్యవసాయ రైతు సంక్షేమ శాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర జల్‌శక్తి అభియాన్‌శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వాటర్‌షెడ్లు, ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్మార్ట్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ మెట్టభూములను సాగులోకి తీసుకురావాలన్నారు. ఉద్యాన పంటలను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం లోపు లక్ష ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగులోకి తేవాలన్నారు. డ్వామా, భూగర్భ జల వనరుల శాఖ అధికారుల సహకారంతో నీటి వనరులను పెపొందిస్తూ ప్రణాళిక ప్రకారం వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆదాయం పెంచే ఒక మైలురాయి ఎన్ఆర్ఈజీఎస్ పథకమన్నారు. పెట్టుబడులుల లేకుండా ఈ నిధులతో పండ్ల తోటలను విస్తారంగా పెంచవచ్చన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, భూగర్భ గనుల శాఖ డీడీ మురళీధర్, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీవోలు, డ్వామా పీడీలు, ఏపీవోలు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

'ఓట్ల దొంగతనం అరికట్టాలి'

వేంపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ఆయువు పట్టులాంటిదని అలాంటి ఓట్ల దొంగతనాన్ని అరికట్టేందుకు ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్‌పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేంపల్లెలో గురువారం ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. పలు కూడళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తులసిరెడ్డి పాల్గొని సంతకం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ, రిగ్గింగ్, దొంగ ఓట్లు వేయడం పరిపాటిగా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 15 వరకు సంతకాల సేకరణ దేశవ్యాప్తంగా జరుగుతోందని తెలిపారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, ఉత్తన్న, సుబ్రమణ్యం రామకృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ ప్రవేశాల రెండో విడత షెడ్యూల్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్ఈ) విడుదల చేసింది. ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ జరగనుంది. మొదటి దశ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో, రెండో దశ రిజిస్ట్రేషన్లు 26 నుంచి 29 వరకు కొనసాగుతాయి. అభ్యర్థుల సర్టిఫికెట్ల ధ్రువీకరణ 27 నుంచి 29 వరకు జరగనుంది. వెబ్ ఆప్షన్లు వినియోగించుకోవడానికి 29 నుంచి అక్టోబరు 1 వరకు అవకాశం ఉంది. ఇప్పటికే ఇచ్చిన ఆప్షన్లను సవరించుకునేందుకు అక్టోబరు 3 నుంచి 6 వరకు గడువు ఇచ్చారు. అక్టోబరు 7 సీట్లు కేటాయిస్తారని, విద్యార్థులు అక్టోబరు 8న కళాశాలలకు హాజరు కావాలని కన్వీనర్ టీవీ శ్రీకృష్ణమూర్తి తెలిపారు. అలాగే విద్యార్థులు తప్పనిసరిగా నిర్ణీత తేదీల్లోనే రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏఆర్‌జీ వెబ్‌సైట్‌ను సందర్శించ వచ్చన్నారు.

అభివృద్ధి కోసం కాదు..

కుర్చీ కోసమే పాకులాట

- మాజీ మేయర్ సురేశ్ బాబు



కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆరాటం అభివృద్ధి కోసం కాదని మాజీ మేయర్ సురేశ్‌బాబు మండిపడ్డారు. 15వ ఫైనాన్స్ నిధులు రాకుండా అడ్డుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. గురువారం అప్సర సర్కిల్ వద్ద తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిపై ఘాటుగా విరుచుకుపడ్డారు. పార్టీ కార్యకర్తలే ఆయనపై అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆయన అవినీతి భాగవతం గురించి టీడీపీ వాళ్లే మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బుగ్గవంక పనుల్లో భారీ అవినీతికి పాల్పడ్డానని తనపై ఆరోపణలు చేశారని.. వాటిని నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకొంటా, నిరూపించలేకపోతే నువ్వు రాజకీయ సన్యాసం తీసుకుంటావా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే నియంతలా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలపై తీర్మానాలను అడ్డుకుంటున్నారని చెప్పారు. అభివృద్ధి కోసం కాకుండా కుర్చీ కోసమే ఆరాటపడుతున్నారని విమర్శించారు. 30 ఏళ్లుగా పార్టీ జెండా మోసిన కార్యకర్తలను పక్కన పెట్టిన మీకు మాట్లాడే అర్హత ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మేయర్‌గా తొలగించడంపై

హైకోర్టుకు సురేశ్‌బాబు

- తదుపరి విచారణ 7కు వాయిదా
- ప్రతివాదులను కౌంటర్ దాఖలు చేయాలన్న కోర్టు

అమరావతి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కడప మేయర్ బాధ్యతల నుంచి తనను తొలగిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ మాజీ మేయర్ సురేశ్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు.

కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి నుంచి తనను తొలగిస్తూ ఈ నెల 23న పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి జారీ చేసిన జీవో 1016, తదనంతరం విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని కోరుతూ కె.సురేశ్‌బాబు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. రాజకీయ కారణాలతో పిటిషనర్‌ను పదవి నుంచి తొలగించారన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం సూచనలతోనే అధికారులు చర్యలకు ఉపక్రమించారన్నారు. వర్ధిని కనస్ట్రక్షన్స్ కంపెనీ పిటిషనర్ సతీమణి, కుమారుడికి చెందినది అన్నారు. ఆ కంపెనీకి పనుల కేటాయింపులకు సంబంధించి పిటిషనర్‌కు అవగాహన లేదన్నారు. రూ.10లక్షల లోపు విలువ చేసే పనులను మున్సిపల్ కమిషనర్ నేరుగా కేటాయించవచ్చు అన్నారు. కౌన్సిల్ ఆమోదం అవసరం లేదన్నారు. సురేశ్‌బాబు అధికారిక దుర్వినియోగానికి పాల్పడ్డారన్న వాదనలో వాస్తవం లేదన్నారు.

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) యతీంద్రదేవ్ వాదనలు వినిపిస్తూ... నిబంధనల ప్రకారం కార్పొరేషన్ పరిధిలోని ఏ కాంట్రాక్ట్ పనులనూ మేయర్ కుటుంబ సభ్యులు చేయడానికి వీల్లేదన్నారు. కార్పొరేషన్ కాంట్రాక్ట్‌లను సురేశ్‌బాబు సతీమణి, కుమారుడికి చెందిన వర్ధిని కనస్ట్రక్షన్స్ కంపెనీ చేసిందన్నారు.. వర్ధిని కనస్ట్రక్షన్స్ ఆఫీస్ అడ్రెస్, సురేశ్ బాబు ఇంటి అడ్రస్ ఒకటేనన్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్‌లు చేయడం గురించి తనకు తెలియదన్న పిటిషనర్ వాదన నమ్మశక్యంగా లేదన్నారు. పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకున్న తరువాతే తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్నారు.

కడప ఎమ్మెల్యే మాధవి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. కార్పొరేషన్‌కు చెందిన కాంట్రాక్ట్‌లను మేయర్ కుటుంబ సభ్యులు నిర్వహించడానికి వీల్లేదన్నారు. అలా చేస్తే మేయర్‌గా అనర్హతకు గురౌతారని నిబంధనల్లో స్పష్టంగా ఉందన్నారు. ఇలాంటి కేసులలో మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే సమాజానికి తప్పుడు సంకేతం వెళ్తుందన్నారు. మధ్యంతర ఉత్తర్వులు పొందేందుకు పిటిషనర్ అనర్హుడని వాదించారు. అందరి వాదనలు విన్న అనంతరం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కడప రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవికి కోర్టు నోటీసులు జారీ చేసింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను అక్టోబర్ 7కి వాయిదా వేసింది.

దళితులకు అన్యాయం జరగకూడదు

- విజిలెన్స్ కమిటీ సమావేశంలో జేసీ అదితి సింగ్




మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్, చిత్రంలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక రుగ్మతలను తొలిగించాలని, దళితులకు ఎక్కడా అన్యాయం జరగకుండా విజిలెన్స్ కమిటీ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో పాటు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు సకాలంలో న్యాయం జరగాలన్నారు. అదే సమయంలో పరిహారం అందేలా అధికారులు చర్యలు చేపడతారన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉంటే తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. నిమ్నవర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా పోలీసు రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. అన్ని మండలాల్లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కాకుండా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టేందుకు కమిటీ కృషి చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్డీవోలు, డీఎస్పీలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, డీఎస్పీలు భావన, వెంకటేశ్వర్లు, రాజేశ్వరరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, బాలాజీ, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతా అన్నపూర్ణేశ్వరి



దేవునికడప ఆలయంలో హనుమంతవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



కడప లలితా పంచాయతన దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవిగా..



కూష్మాండదేవి అలంకారంలో విజయదుర్గాదేవి

ప్రొద్దుటూరు టౌన్ / కడప కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయం, గౌరమ్మకట్టవీధి, రాజరాజేశ్వరీదేవి ఆలయం, ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కడప నగరంలోని లలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అనుగ్రహించారు. కడప నగరంలోని బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో కూష్మాండదేవిగా, అమ్మవారిశాలవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని బారులు తీరారు. దసర సందర్భంగా ఆలయాలన్నీ నూతనశోభ సంతరించుకున్నాయి. దేవునికడపలో వెంకటేశ్వర స్వామి గురువారం రాత్రి హనుమంతవాహనంపై ఊరేగారు.



కడప అమ్మవారిశాలలో గజలక్ష్మీదేవి అలంకారం



కడప అమ్మవారిశాలలో కిటకిటలాడుతున్న భక్తులు

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి గురువారం నుంచి నీరు నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు నుంచి ప్రాజెక్టులోకి వచ్చే కృష్ణాజలాలు 500 క్యూసెక్కులకు తగ్గడంతో మైలవరానికి నీరు నిలుపుదల చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 26.8 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయ డీడీగా పెద్దయ్య

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయ డీడీగా పెద్దయ్యను ప్రభుత్వం నియమించింది. ఇదే కార్యాలయంలో సహాయ సంచాలకుడు (ఏడీ)గా పనిచేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పించారు. దీంతో కార్యాలయంలో ఆయనకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఏపీఈఎస్ఎస్‌ఏ ప్రెసిడెంట్ రమేశ్‌రాజు, సెక్రటరీ రాంమోహన్‌నాయక్, సంబేపల్లె ఏఎస్‌వో హాస్సేన్‌సాహెబ్, ఆఫీస్ సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

నేడు తాత్కాలిక ఫ్యాకల్టీ నియామకానికి ఇంటర్వ్యూ

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్, ప్లానింగ్ విభాగాల్లో తాత్కాలిక విజిటింగ్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజలకు పూర్తి అవగా హన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సూపర్‌జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ జీఎస్టీ 2.0 కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చం ద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి అక్టోబరు 19 వరకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 29 నుంచి స్వయం సమాయక సంఘాలు, గ్రామ, వార్డు సచివాలయ సమావేశాలు, వ్యాపార సంస్థలు, ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ పన్నుల తగ్గింపుపై నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే అంశాలపై ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 30 నుంచి అక్టోబరు 6 వరకు వ్యవ సాయం, ఇతర వృత్తుల వారికి సంబంధించిన రైతుసేవా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, వ్యవసాయ యంత్రాల ప్రదర్శనల ద్వారా తగ్గింపు ధరలపై అవగాహన కల్పించాలన్నారు, అక్టోబర్ 7 నుంచి 13 వరకు మానవవనరుల అభివృద్ధి, డిజిటల్ సాకారంలో భాగంగా పాఠశాలలు, కళాశాలల వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వ హించాలన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకు స్మార్ట్ సాకార ప్రదర్శనలు, 19న నిజమైన దీపావళి కార్యక్రమం నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ముందుగా జాయింట్ కమిషనర్ స్టేట్ టాక్సీస్ సుమతి కొత్త జీఎస్టీ ప్రకా రం వివిధ రంగాల వారీగా జీఎస్టీ వర్తింపు ఎలా జరుగుతోందనే విషయాలను వివరించారు. సమా వేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ నచికేత్

కడప విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు

కడప విమానాశ్రయ అభివృద్ధిలో భాగంగా నిబం ధనలకు లోబడి ఎయిర్‌పోర్ట్ నూతన భవన నిర్మాణ పనులను చేపట్టేందుకు అన్ని రకాల భద్ర తా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్‌లో ఎస్పీ షెల్కే నచికే తన్ విశ్వనాథ్‌తో కలిసి కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించి చర్చించారు. విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పొద్దర్, కేఎంసీ కమిషనరు మనో జ్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంపొందించి, ఔత్సాహిక రైతులకు అవసరమైన వన రులు సమకూర్చాల్సిన అవసరం ఉందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వ్యవ సాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీ సీఎన్‌ఎఫ్) కార్యక్రమం జిల్లాలో అమలు తీరు విస్తరణపై జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్, పర్యావరణ ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించడమే లక్ష్యంగా బాధ్యాతాయుతంగా పని చేయాలని ఆదేశించారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నందున ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటజనార్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉద్యోగులు పండుగలను మరచిపోయారని పేర్కొన్నారు. ఆ ప్రభుత్వం బాధలు భరించలేకే ఉద్యోగులు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా పీఆర్‌సీని ఏర్పాటు చేయడం, కరవు భత్యం కానీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రిజ్వాన్‌ఆలీ, పుల్లయ్య, రమణారెడ్డి, నాగచంద్రుడు, మాధవరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధాన నీటిపారుదల, మధ్యస్థ నీటిపారుదల, చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన నీటి పారుదలశాఖ ఎస్ఈ, ఈఈలు, డీఈఈ, ఏఈఈ/ఏఈలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జీఎన్ఎస్ఎస్ కాలువ, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, శ్రీనివాసపురం రిజర్వాయర్, అడవిపల్లి రిజర్వాయర్ పనులు, అన్నమయ్య ప్రాజెక్టు, వెలిగల్లు ప్రాజెక్టు, మైనర్ ఇరిగేష్ ప్రాజెక్టులు పింఛా, ఝరికోన, బాహుద, పెద్దేరు ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు భూసేకరణకు సంబంధించి గ్రామం, మండలం, విస్తరణ వివరాలను తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లైనింగ్ పనులకు సంబంధించి అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులను మొదలు పెట్టాలన్నారు. 178 చిన్న తరహా ట్యాంకుల సంబంధించిన ఎస్టిమేట్లను ఇప్పటికే ప్రభుత్వానికి ప్రపోజల్స్ పంపడం జరిగిందని అధికారులు తెలియజేయగా ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

హోంగార్డు కుటుంబానికి చేయూత



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ ధీరజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లి సబ్ డివిజన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బి.ఈశ్వర్‌నాయక్ విధులకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో అతడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఆ హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచేందుకు జిల్లాలోని హోంగార్డులు ముందుకొచ్చారు. తమ ఒకరోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా ఇచ్చారు. మొత్తం రూ.2 లక్షల 32 వేల 172లు సమకూర్చి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ద్వారా హోంగార్డు భార్య లక్ష్మీబాయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సహచరులను కోల్పోవడం పోలీస్ కుటుంబానికి బాధాకరమన్నారు. ఇలాంటి సందర్భాల్లో హోంగార్డులు ఒక్కరోజు అలవెన్స్‌ను విరాళంగా ఇవ్వడం మానవతా విలువలకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, ఏఆర్ ఎస్ఐ బాలాజీ, జూనియర్ అసిస్టెంట్ జయకుమార్, బాధిత కుటుంబ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నారు.

హ్యాకథాన్‌తో ఆలోచన శక్తి బహిర్గతం



ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన బృందాలతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2025 కార్యక్రమం ద్వారా విద్యార్థులోని ఆవిష్కరణాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన శక్తి బహిర్గం అవుతుందని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త అన్నారు. గురువారం ఇడుపులపాయలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ -2025లో భాగంగా విద్యార్థులు అభివృద్ధి చేసిన వివిధ విభాగాల వారీగా అప్లికేషన్లు ప్రదర్శించారు. డైరెక్టర్ కుమారస్వామి గుప్త, డీన్ ఆఫ్ అకడమిక్స్ రమేష్‌కైలాష్, ఎస్‌పీఓసీ కోఆర్డినేటర్ ఉదయశ్రీ తదితర కమిటీ/జ్యూరీ మెంబర్స్ సమక్షంలో నిర్వహించగా 106 బృందాలు తమ అప్లికేషన్లను ప్రదర్శించాయి. ఇందులో 50 ఉత్తమ బృందాలను ఎన్నుకొని నేషనల్ ఫైనల్స్‌కి పంపించేలా చేస్తామని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన ఈర్ల రాజు

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి కొండావాండ్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈర్ల రాజు (28) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లె గ్రామం ముద్దినేని వడ్డెపల్లెకు చెందిన ఈర్ల రాజు కొండావాండ్లపల్లె వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో టైరు పంచర్ షాపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా కొండావాండ్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డుపై ఎటువంటి సిగ్నల్స్ లేకుండా లారీ ఆగి ఉండడంతో ఢీకొన్నట్లు తెలిపారు. ప్రమాదంలో రాజు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పిల్లలు ఇరువురు చిన్నవయస్సు వారు. కాగా ఇంటి యజమాని మృతి చెందడంతో ముదినేని వడ్డెపల్లెలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈర్ల రాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించారు. మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ప్రస్తుత దహన సంస్కరణలకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి స్వగ్రామమైన ముదినేనివడ్డెపల్లెకు మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి నివాళులర్పించారు.

రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో గల అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. రికార్డులు, కేసు డైరీలు, లాకప్ గది, ఫిర్యాదుల రిజిస్టర్, సిబ్బంది విధి నిర్వహణ అన్నింటినీ పరిశీలించి పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీసులకు అత్యంత పెద్ద బలమని ఆయన అన్నారు. అనంతరం ఎస్పీ పాత పోలీసు క్వార్టర్స్‌లోని పోలీసు జాగిలాల కెనాల్స్‌ను సందర్శించారు. అక్కడ డాగ్స్ సంరక్షణ, శిక్షణ, ఆహార సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నేరాల నియంత్రణలో పోలీసు జాగిలాల పాత్ర కీలకం అని, వాటిపై తగిన శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి, ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ డాగ్స్ ఇన్‌చార్జి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మణిగండన్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జి ఆదేశాలతో రంగస్వామి ఆచూకీ గుర్తింపు



రంగస్వామితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి

కడప రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు ఇంటి నుంచి కనిపించకుండా పోయిన రంగస్వామి ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు రంగస్వామిని గురువారం జిల్లా ప్రధాన జడ్జి ఎదుట హాజరుపరిచారు. రంగస్వామితో జడ్జి మాట్లాడి తదుపరి చట్టపరమైన సహాయ చర్యలను తీసుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌ను ఆదేశించారు. బ్రహ్మంగారిమఠానికి చెందిన గుర్రం లక్ష్మి తన కుమారుడు గుర్రం రంగస్వామి ఇంటి నుంచి కనిపించకుండా పోయాడని, ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని... నా కుమారుని నా దగ్గరకు చేర్చాలని జిల్లా ప్రధాన జడ్జికి బుధవారం విన్నపం ద్వారా అభ్యర్థించారు. ఈమేరకు జడ్జి వెంటనే స్పందించి రంగస్వామి ఆచూకీని తెలుసుకోవడానికి డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబావక్రుద్దీన్‌ను నియమించారు. ఆయన పోలీసుల సహకారంతో రంగస్వామిని కనుగొని ప్రధాన న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య



మహబూబ్‌జాన్ (ఫైల్)

రాయచోటిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసనగర్‌కు చెందిన షేక్ మహబూబ్‌జాన్ (46) అనే మహిళ భర్త వేధింపులు తాళలేక గురువారం తెల్లవారుజామున ఒంటిపైన కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల్లోకి వెళితే... రెండు నెలల క్రితం మృతురాలి కుమార్తెలు ఇద్దరు ఇదేవిధంగా కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెళ్లికాలేదన్న బాధతో మనస్థాపానికి గురై అక్కా, చెల్లెళ్లు ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి మహబూబ్‌జాన్‌కు భర్త వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈవిషయాన్ని తెలుసుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మహిళ ఆత్మహత్యపై విచారించడంతో పాటు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరొకరికి గాయాలు

కడప క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ కారును ఓవర్‌టేక్ చేయబోయిన పల్సర్ మోటరు సైకిల్ అదుపు తప్పి డివైడరును ఢీకొంది. ఈప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి (25) అనే యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన 24వ తేదీ బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా... ఖాజీపేట మండలానికి చెందిన చెన్నకేశవ రెడ్డి లారీ డ్రైవ రుగా పనిచేస్తూ తన కుటుంబ సభ్యులతో కడప నగరంలోని నబీకోటలో నివాసం ఉంటున్నాడు. ఇతని పెద్దకుమారుడైన చంద్రశేఖర్‌రెడ్డి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో నబీకోటకు చెందిన తన స్నేహితుడు వివేక్ సాయితో కలిసి బుధవారం రాత్రి అలం ఖాన్‌పల్లె వైపు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్రగాయాలై పడిపో వడంతో స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మోటరు సైకిలు నడుపుతున్న వివేక్ సాయికి గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

కొత్త జీఎస్టీతో ప్రజలకు మరింత డబ్బు ఆదా

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త జీఎస్టీ రేట్లతో ప్రజలకు మరింత డబ్బు ఆదా అవుతున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు వస్తువులపై ధరలు తగ్గాయని ప్రజలు తగిన జీఎస్టీ రేట్లను దృష్టిలో పెట్టుకొని వస్తువుల వినియోగాన్ని పెంచుకోవచ్చునని పేర్కొన్నారు. వ్యక్తిగత సంరక్షణ, ప్యాకేజ్డ్ ఫుడ్స్, డెయిరీ స్నాక్స్, కన్ఫెక్షనరీ, ప్రాసెస్డ్ ఫుడ్స్ ప్రోజెన్, న్యూట్రీషన్ ఉత్పత్తులు, వైద్య, మెడికల్ కిట్స్ స్టేషనరీ ఆటోమోటీవ్స్ వాహనదారులు క్రీడా పరికరాలు బొమ్మలు, ఇండోర్ గేమ్స్‌పై జీఎస్టీ తగ్గినట్లు తెలిపారు.

బాకీదారుల ఆస్తుల రికవరీతోనే ఫైనాన్షియర్ హత్య


ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి బాకీదారుల ఆస్తుల అటాచ్‌మెంటు చేసుకోవడంతో కక్ష పెంచుకొని హత్యకు పాల్పడినట్లు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. ప్రొద్దుటూరు శివారులోని బొల్లవరం సమీపంలో మున్సిపల్ ప్లాట్ల వద్ద నివాసం ఉంటున్న కొండా వేణుగోపాల్‌రెడ్డి పట్టణంలో చాలా మందికి వడ్డీలకు డబ్బులు ఇస్తుండేవారు. సకాలంలో అప్పులు చెల్లించని వారిపై కోర్టులో సివిల్‌దావా వేసి ఆస్తులను అటాచ్‌మెంట్ కోరేవారు. ఈ క్రమంలో 2016లో వెన్నపూస లక్ష్మిరెడ్డి, ఎడమకంటి వెంకటసుబ్బారెడ్డిల ఇళ్లను కూడా అటాచ్‌మెంట్ కోర్టు ఆర్డర్ ద్వారా రికవరీ పొందారు. అప్పట్లో వారు వేణుగోపాల్‌రెడ్డిపై కక్షతో హత్యాయత్నానికి పాల్పడగా కేసు నమోదు అయింది. దీంతో వీరి మధ్య వైర్యం పెరిగింది. ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వాపారులైన లక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు హైదరాబాదులో అపార్టుమెంట్ నిర్మిస్తూ తమ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోయిని నగేష్‌కు తమ వైరాన్ని చెప్పుకుని వేణుగోపాల్‌రెడ్డిని హతమార్చాలని కోరారు. ఖర్చుల కోసం సుమారు రూ.70వేలు నగదును పలు దఫాలుగా ఇవ్వడంతో పాటు జీవనోపాధికోసం ఏదైనా వ్యాపారం పెట్టిస్తామని ఆశ చూపారు. దీంతో నగేష్ తన స్నేహితులైన అజయ్‌కుమార్, శివప్రసాద్, ప్రణయకుమార్‌ల ద్వారా హత్యకు ప్రణాళిక రూపొందించారు. సుమారు నెల రోజుల కిందట హైదరాబాదు నుంచి ఇక్కడకు వచ్చి వేణుగోపాల్‌రెడ్డిపై కిడ్నాప్‌కు నాలుగుసార్లు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీ రాత్రి ఇంటికి వెళుతున్న వేణుగోపాల్‌రెడ్డిపై కారంపొడి చల్లి కాళ్లు, చేతులతో కొట్టి, గొంతుమీద కాలువేసి తొక్కి అతన్ని చంపారు. శవాన్ని దువ్వూరు మార్గంలోని కామనూరు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహంలో పడవేసి హైదరాబాదుకు పారిపోయారు. 21వ తేదీ పోలీసు ప్రత్యేక బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో చాపాడు సమీపంలో కుందూ నదిలో వేణుగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని గుర్తించారు. వేణుగోపాల్‌రెడ్డి భార్య ప్రమీళారెడ్డి ఫిర్యాదు మేరకు బాధితులు అనుమానితులపై దృష్టి పెట్టగా కిడ్నాప్, హత్య వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, డీఎస్పీ భావన

ఆరుగురు నిందితులు

ఫైనాన్షియర్ వేణుగోపాల్‌రెడ్డి హత్య కేసులో ప్రొద్దుటూరు పట్టణంలోని సాయికుటీర్ రోడ్డుకు చెందిన బిల్డర్ వెన్నపూస లక్ష్మిరెడ్డి (53), భాకరాపేట వీధికి చెందిన మెకానిక్ ఎడమకంటి వెంకటసుబ్బారెడ్డి (55), తెలంగాణా రాష్ట్రం మెదక్‌జిల్లా అల్లాదుర్గం గ్రామానికి చెందిన బోయిన నాగేష్ అలియాష్ హర్ష (26), మెదక్‌జిల్లా మర్రి ప్రాంతానికి చె ందిన లైనీ అజయ్‌కుమార్ (18), హైదరాబాదు నగరం బాచుపల్లికి చెందిన చింతలచెరువు ప్రణ య్‌కుమార్ (20), మియాపూర్‌లోని శ్రీవాణినగర్‌కు చెందిన శ్రీనివాసనగర్ ప్రాంతానికి చెందిన కొత్త శివప్రసాద్ (22)లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మారుతీవెగనార్ కారు, హోండా యాక్టివా స్కూటీ, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. హత్య కేసులో నిందితులను అరెస్టు చేయడంలో శ్రమించిన డీఎస్పీ పి.భావన, రూరల్ సీఐ నాగభూషణ్, రూరల్ ఎస్ఐలు డి.అరుణ్‌రెడ్డి, కె.సి.రాజు, రాజుపాళెం ఎస్ఐ కె.వెంకటరమణ, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.

Ajc-249711

WANTED

Eicher Generator షోరూం, కడప టౌన్ నందు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి బైక్ కలిగిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. లోకల్ వాళ్ళకు ప్రిఫరెన్స్ ఇవ్వబడును. సంప్ర. సెల్ నెం. : 99495 49697

Ajc-000

CHANGE OF NAME

I, Tappa Mahammad Ghouse (Old Name) R/o 8-214, Bhagath Singh Colony, Proddatur, Kadapa Dist. A.P. Now I change my name as Tappa Mahammad Gouse (New Name) S/o Tappa Alisa

AJC-000

LOSS OF PASSPORT

I, AQUIB AHMED S/o. SHABEER AHMED, R/o D.No. 8/1476, AGADI STREET, KADAPA, Y.S.R. KADAPA Dist., A.P-516001, India. I am the holder of Indian Passport bearing no: V5407021. The said passport was lost by me, while I was going to Xerox shop near Ameen peer Dargah, Kadapa on 20-08-2025.

AJC-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మాడబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్,షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్)గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.

AJA- 246718

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఎల్‌వీపీఈఐ పరిశోధకుల ఘనత

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ప్రతిష్ఠాత్మక2025 స్టాన్‌ఫోర్డ్/ఎల్సెవియర్ టాప్ 2శాతం సైంటిస్ట్ జాబితా, ప్రమాణిక సైటేషన్ మెట్రిక్స్ ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన పరిశోధకుల జాబితా విడుదల చేసిందని, వీటిలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ (ఎల్‌వీపీఈఐ) మరోసారి నేత్ర వైద్య పరిశోధనలో తన ప్రపంచ నాయకత్వాన్ని ప్రదర్శించిందని ఎల్‌వీపీఈఐ నేత్రవైద్యశాల హెడ్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి ప్రకటన ద్వారా తెలిపారు. ఏడుగురు ఎల్‌ఈపీఈఐ అనుబంధ క్లినిషియన్ శాస్త్రవేత్తలు జీవితకాల ర్యాంకింగ్స్ 15 మంది 2025 వార్షిక ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారన్నారు. ఎల్‌వీపీఈఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లె ఎన్‌రావు భారతదేశంలో నేత్రవైద్య రంగంలో జీవితకాలర్యాంకింగ్‌లో రెండోస్థానంలో నిలిచారన్నారు.

అన్నదానం



కడప నాగరాజుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవుని కడపలో నవరాత్రుల సందర్భంగా మహేష్, భరత్, దేవుని కడపయూత్ అమ్మవారి మట్టి విగ్రహం ఏర్పాటుచేసి ఘనంగా పూజలుచేశారు. అమ్మవారి ఆలయంలో నవరాత్రులలో భాగంగా 5వ రోజు గురువారం అడవాల మునికుమార్ ఆధ్వర్యంలో అన్నదానకార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టింబర్ డిపో కాల్వ వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దుల శంకర్, కర్ణాటి సురేష్‌రవి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టిన కడప ఎమ్మెల్యే మాధవి



కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్‌గా కడప ఎమ్మెల్యే మాధవి బాధ్యతలు చేపట్టారు. గురువారం అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ అనుబంధ భవనాన్ని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ కొత్త భవనంలో ప్రభుత్వ చీఫ్ విప్, విప్ కార్యాలయాలు, మీడియా పాయింట్, క్యాంటీన్ సౌకర్యం తదితర విభాగాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి కొత్తగా ఏర్పాటుచేసిన కార్యాలయంలో ప్రభుత్వవిప్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీపొలిట్ బ్యూరో సభ్యుడు, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Sibyala Sathyanarayana** S/o **late Jayaram** R/o House No.104/22, Narasaramaiahgaripalle, Chinthakommadinne Mandal, YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY**: Item No.1, **Sy. No.** : Survey No. 17, **Extent Area (in acres / hec. Sq.Yds./ Sq.ft.)** 127.20 Sq. Yards, **Location (Address) :** Residential Building Bearing d.No. 104/44 vide Assessment No. 1013068156 situated at YSR Kadapa District, Kadapa Rural District, Kadapa Municipal Corporation Area, Krishnapuram Village Fields, (Narasaramaiahgaripalle Village) in Sy.No. 17 to an extent of 127.20 Sq. yards **BOUNDARIES :** EAST : Annam Nagamalleswarayya House, WEST: Road, North : Claimants 2 feets Wide Site, SOUTH: Obu Ganganna's House

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Podadurthi Saicharan** S/o **Podadurthi Ramamohan Chari** R/o House No.9/179, Saipeta Street, Kadapa City YSR Kadapa dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY**: Item No.1, **Sy. No.** : Survey No. 92/4, **Extent Area (in acres / hec. Sq.Yds./ Sq.ft.)** 67.83 Sq. Yards, **Location (Address) :** Residential Building Bearing d.No. 9/179-2 vide Assessment No. 1013072522 situated at YSR Kadapa District, Kadapa Urban Sub District, Kadapa Municipal Corporation Area, Kadapa City 9th Ward, Saipeta in Sy.No. 92/4 to an extent of 67.83 Sq. yards **BOUNDARIES :** EAST : Podadurthi Bharathamma Plot No.1 Site, WEST: Podadurthi Bharathamma D.No. 179 Midde House, North : Sandu Rastha, SOUTH: Podadurthi Ramamohan Chari D.No. 9/179-1, Midde House and Rasigoda

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa-1 branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Yerrapureddy Satish Kumar Reddy** S/o **Y. Lakshmi Reddy** R/o D. No.39/641-4-2, Patel Road, Aravinda Nagar, Kadapa City, YSR Dist.. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY**: **Item No.1. :** Residential Vacant land situated at Y.S.R. Dist. kadapa Rural Sub-District, C.K.Dinne Mandal, Kopparthi Village fields and Panchayat, Near Yerramachupalli Village, situated at Srihari Nivas Nagar in Sy.No. 474, to an extent of Ac. 0.04 cents and 132 Sq. links in plot no. 256, out of Ac. 4.05 cents. **BOUNDARIES :** EAST : Site of Plot No. 189, WEST: 30 Feet Wide Road, North : Site of Plot No. 255, SOUTH: Site of Plot No. 257, **Item No.2 :** Residential Vacant land situated at Y.S.R. Dist. kadapa Rural Sub-District, C.K.Dinne Mandal, Kopparthi Village fields and Panchayat, Near Yerramachupalli Village, situated at Srihari Nivas Nagar in Sy.No. 472, to an extent of Ac. 0.03 cents and 305 Sq. links in plot no. 234, out of Ac. 3.86 cents. **BOUNDARIES :** EAST : Site of Plot No. 211, WEST: 30 Feet Wide Road, North : Site of Plot No. 233, SOUTH: Site of Plot No. 235, **Item No.3 :** Residential Vacant land situated at Y.S.R. Dist. kadapa Rural Sub-Dt, C.K.Dinne Mdl, Kopparthi Village fields and Panchayat, Near Yerramachupalli Vil., situated at Srihari Nivas Nagar in Sy.No. 473/2B, to an extent of Ac. 0.07 cents and 128 Sq. links in plot no. 8, out of Ac. 2.59 cents. **BOUNDARIES :** EAST : Others Site, WEST: 30 Feet Wide Road, North : Site of Plot No. 7, SOUTH: Site of Plot No. 9

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa-1 branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Yerrapu Satish Reddy** S/o **Y. Lakshmi Reddy** R/o D. No.39/641-4-2, Patel Road, Aravinda Nagar, Kadapa City, YSR Dist.. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY**: **Item No.1. :** Residential Vacant land situated at Y.S.R. Dist. kadapa Rural Sub-District, C.K.Dinne Mandal, Kopparthi Village fields and Panchayat, Near Yerramachupalli Village, situated at Srihari Nivas Nagar in Sy.No. 474, to an extent of Ac. 0.04 cents and 132 Sq. links in plot no. 256, out of Ac. 4.05 cents. **BOUNDARIES :** EAST : Site of Plot No. 189, WEST: 30 Feet Wide Road, North : Site of Plot No. 255, SOUTH: Site of Plot No. 257, **Item No.2 :** Residential Vacant land situated at Y.S.R. Dist. kadapa Rural Sub-District, C.K.Dinne Mandal, Kopparthi Village fields and Panchayat, Near Yerramachupalli Village, situated at Srihari Nivas Nagar in Sy.No. 472, to an extent of Ac. 0.03 cents and 305 Sq. links in plot no. 234, out of Ac. 3.86 cents. **BOUNDARIES :** EAST : Site of Plot No. 211, WEST: 30 Feet Wide Road, North : Site of Plot No. 233, SOUTH: Site of Plot No. 235, **Item No.3 :** Residential Vacant land situated at Y.S.R. Dist. kadapa Rural Sub-Dt, C.K.Dinne Mdl, Kopparthi Village fields and Panchayat, Near Yerramachupalli Vil., situated at Srihari Nivas Nagar in Sy.No. 473/2B, to an extent of Ac. 0.07 cents and 128 Sq. links in plot no. 8, out of Ac. 2.59 cents. **BOUNDARIES :** EAST : Others Site, WEST: 30 Feet Wide Road, North : Site of Plot No. 7, SOUTH: Site of Plot No. 9

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

వనవిహారీ.. నమోస్తుతే.!

కడప కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రంగురంగుల విద్యుద్దీపాల కాంతుల్లో అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. వనవిహారీ.. లయకారిణీ నమో నమః.. అంటూ భక్తులు శరణు కోరారు.

నగరంలో ఆలయాల బాట పట్టిన భక్తజనం..: దసరా శరన్నవరాత్ర ఉత్సవాలను తిలకించేందు కు నగర ప్రజలు కుటుంబ సమేతంగా ఆలయాల బాట పట్టారు.

లలితా పంచాయతన దేవాలయంలో..: నగర శివా రు ప్రాంత శ్రీలలితా పంచాయతన దేవాల యంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు.

విజయదుర్గాదేవి ఆలయంలో..: విజయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కూష్మాండ దేవిగా భక్తుల కు దర్శనం ఇచ్చారు. రాత్రి 8గంటలకు విజయదుర్గామల్లికార్జునులు సింహ వాహనంపై ఆలయం ఆలయ ప్రదక్షిణ గావించారు.

అమ్మవారిశాలలో..: అమ్మవారిశాలలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజ రాజేశ్వరి ఆలయంలో..: శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు మీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: నగర గడ్డి బజారులో వెలసిన లక్ష్మీ సత్యనారాయణ స్వామి దేవస్థానం (బాలాజీ) లో అమ్మవారు వైకుంఠనాథ ఆలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: రాజారెడ్డివీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీలలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఎర్రముక్కపల్లెలో..: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో పాటు నగర శంకరాపురం ఎస్‌బీఐ సమీపంలో వెలసిన అమ్మవారిఆలయంలో అమ్మవారు లలితాదేవి ఆలంకారంలో దర్శనమి చ్చారు. అలాగే సీయోనుపురం (రాజారెడ్డివీధి)లో వెల సిన శ్రీశక్తిసవారమ్మఅవ్వ దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవి అలంకారంలో దర్శన మిచ్చారు. అలాగే నగర చిన్నబెస్తవీధిలోని జగన్మాత బాల పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. హనుమప్ప వీధిలో వెలసిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో అమ్మవారు బ్రహ్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



కడప..రాజరాజేశ్వరిదేవి గుడిలో మీనాక్షిదేవి అలంకారం

వల్లూరు..: మండలకేంద్రమైన వల్లూరులో ఉన్న ఆర్యవైశ్య కళ్యాణమండపంలో దసరా సందర్భంగా అమ్మవారిని భరతమాత అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యంకల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరం చెల్లించి తమ మొక్కులు చెల్లించారు.

కమలాపురం రూరల్..: పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెండ్లిమర్రి..:పొలతల మల్లికార్జున స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు.

సీకేదిన్నె..:బయనపల్లి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. గంగమ్మ ఆలయంలో కాత్యాయని దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

చెన్నూరు..: రామలింగ చౌడేశ్వరి దేవాలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి, తూర్పువీధి మాతమ్మగుడి ఆలయంలో అమ్మవారు మీనాక్షిదేవిగా దర్శనమిచ్చారు.

వేంపల్లె..: వేంపల్లెలోని అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి దేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలుచేశారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయంలో గురువారం పార్వతీదేవి అమ్మవారు లలితాపరమేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు.



కలశాలతో ప్రదక్షిణ చేస్తున్న ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్





కడప..గడిబజారు ఆలయంలో లలితాదేవి అలంకారం, వేంపల్లెలో చౌడేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు





ఎర్రముక్కపల్లె చౌడేశ్వరిదేవి ఆలయంలో గాయత్రిదేవి ఆలంకారంలో అమ్మవారు, చిన్నబెస్తవీధిలో త్రిపురసుందరీదేవి అలంకారం

ప్రొస్టేట్ సమస్యపై రేపు ఉచిత వైద్య శిబిరం

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐటీఐ సర్కిల్, అక్కాయపల్లె పార్క్ ఎదురుగా ఉన్న వేదాంత హాస్పిటల్స్‌లో ఈనెల 27న ప్రొస్టేట్ గ్రంధి సమస్యపై పురుషుల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కిడ్నీ, మూత్ర పిండాల వ్యాధినిపుణుడు డాక్టర్ ఎన్ దినేష్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొస్టేట్ గ్రంధి పురుషుల్లో వీర్యాన్ని ఉత్పత్తిచేసే, మూత్ర ప్రవాహాన్ని నియంత్రించే గ్రంధి అని తెలిపారు. ప్రొస్టేట్ గ్రంధి పెద్దదిగా మారి మూత్ర ప్రవాహాన్ని అడ్డుకుంటుందని తెలిపారు. ఇన్ఫెక్షన్, క్యాన్సర్ సమస్యలు ఉంటాయని పేర్కొన్నారు. మూత్రం సన్నగా రావడం, ఎక్కువసార్లు రావడం, మంట,రక్తం, తొందరగా రావడం లాంటి సమస్య ఉన్నవారు సంప్రదించాలని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. రక్తపరీక్షలు, స్కానింగ్‌లో 50శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9666015678 సంప్రదించాలని తెలిపారు.

నిందలువేస్తే ఊరుకునేది లేదు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే మాధవిపైనిందలు వేస్తే సహించేది లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం మేయర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. కడప మాజీ మేయర్ సురేష్‌బాబు మేయర్ పదవిని దుర్వినియోగం చేసి అక్రమాలు చేశారని గుర్తించిన ప్రభుత్వం, చట్టప్రకారం ఆయనను పదవి నుంచి తొలగించిందన్నారు.

సంగమేశ్వరుని సన్నిధిలో పుత్తా



వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయంలో గురువారం సంగమేశ్వరుడు, పార్వతీ దేవిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు సుబ్రహ్మణ్యశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఊర్లకు వెళ్లే ప్రజలు జాగ్రత్త పడాలి

కడప క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ఇంటిని వదిలి ఊర్లకు వెళ్లే ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. బలమైన తాళాలు వాడాలన్నారు.ఇంటి ప్రధాన తలుపులు వెనుక తలుపులు, బాల్కనీలకు తాళాలు వేసి భద్రపరచాలన్నారు. విలువయిన వస్తువులు ఇళ్లల్లో ఉంచరాదన్నారు. ఇల్లు ఖాళీ చేసి వెళ్లే ముందు స్థానిక పోలీసు స్టేషన్‌లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం కోసం నమోదు చేసుకోవాలన్నారు.

మెగా డీఎస్సీ-2025 నియామకపత్రాలు పంపిణీ



కొత్త టీచర్లతో ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ సచివాలయ ప్రాంగణంలో గురువారం మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప జిల్లా డీఎస్సీ అభ్యర్థులను అభినందించారు.

సర్వజన ఆసుపత్రిలో ఘనంగా ఫార్మసిస్ట్ డే




ఫార్మసిస్టులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సూపరింటెండెంట్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య విభాగానికి వైద్యులు, ఫార్మసిస్టులు రెండుకళ్లు అని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఫార్మసిస్ట్ విభాగంలో గురువారం ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామవేంద్రరెడ్డి, ఫార్మసిస్టులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్‌రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాతంత్ర వాదులు, మేధావులు, విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు హాజరై డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టబోయే కార్యాచరణకు సూచనలు ఇవ్వాలని కోరారు.

ఆర్టీసీ ఎండీని కలిసిన ఎస్పీ



కడప క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో గురువారం రాష్ట్ర పూర్వ డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమల రావును ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఇన్‌చార్జిమేయర్‌ను కలిసిన అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్ర నగర్ 41వ డివిజన్‌లో ఇన్‌చార్జి మేయర్‌గా త్వరలో బాధ్యతలు చేపట్టనున్న డిప్యూటీ మేయర్ ముంతాజ్ జమాల్ వలిని వారి నివాసంలో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష కలిశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'కూటమిపాలనంతా అవినీతి'

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనంతా అవినీతి అక్రమమే అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో అవినీతి, అక్రమాలు విస్తరించిపోతున్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఎరువులు, ముఖ్యంగా యూరియా అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మన్సూర్ అలీఖాన్‌ను సత్కరించిన సురేష్‌బాబు



మన్సూర్‌ను సన్మానిస్తున్న జ్యోతిష నిపుణుడు సురేష్‌బాబు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నూతనంగా టీడీపీ నగర అధ్యక్షుడుగా ఎంపికైన మన్సూర్ అహ్మద్ అలీఖాన్‌ను తన నివాసంలో గురువారం ప్రముఖ జ్యోతిషుడు సురేష్‌బాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్సూర్ అలీఖాన్ మంచి సేవా తత్పరుడని పేద విద్యార్థులకు ఎంతో సహకారం కూడా అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అల్లారక, మహేష్, మొహిద్దీన్, అజయ్ పాల్గొన్నారు.

మండలమంతా వెలుగులు నింపడమే లక్ష్యం



విద్యుత్‌స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చెన్నూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో పూర్తి స్థాయిలో విద్యుత్ స్తంభాలు, బల్బులు ఏర్పాటు చేసి రాత్రివేళ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ కన్వీనరు. కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరు క్రాసింగ్ నుంచి పోలీసుస్టేషన్ వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటరు మేర విద్యుత్ స్తంభాలు, బల్బులు వేసేందుకు గురువారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనిని మొదలు పెట్టించారు. ఈ సందర్భంగా మండల కన్వీనరు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆర్‌అండ్‌బీ రోడ్డులో సరైన విద్యుత్ సౌకర్యం లేక రాత్రివేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ విషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణారెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు వెంకటసుబ్బయ్య, షబ్బీర్‌హుస్సేన్, సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

పులివెందుల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూట మి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ పాల్గొని ప్రజలకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందించారు. అలాగే తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పులివెందుల మున్సిపాలిటీలోని యర్రగుడిపల్లెలో ప్రజలకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. తొండూరు మండలం మల్లేల గ్రామంలో తహసీల్దార్ రామచంద్రుడు, టీడీపీ నాయకులు శివమోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి ప్రజలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మహబూబ్ బాష, గుణకనపల్లె అమర్, అంబకపల్లె మునెయ్య, రామాంజనేయులు, శ్రీను, పులివెందుల డీటీ వెంకటరెడ్డి,ఆర్ఐ షెక్షావలి, డీటీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసీ దినోత్సవం



సీనియర్ ఫార్మసిస్టును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

సీకేదిన్నె, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నెల్సన్ కుమార్ తెలిపారు. కళాశాలలో ఏపీ ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులు సుధాకర్, రాధాకృష్ణ, సుబ్బారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కరస్పాండెంట్ గౌతమ్‌రెడ్డి విద్యార్థులు నిర్వహించిన పోస్టర్ ప్రజంటేషన్‌కు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జయసుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
D.C.M.: 99854 11184

మాతా.. అన్నపూర్ణేశ్వరి



ప్రొద్దుటూరు శివాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నాలుగవ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను కటాక్షించారు. అమ్మవారిశాల, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, గౌరమ్మకట్టవీధి, రాజరాజేశ్వరీదేవి ఆలయం, ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం, శివాలయాల్లో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా పాత మార్కెట్‌లోని చెన్నకేశవస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఎర్రగుంట్లలో: దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మెయిన్‌బజార్ అమ్మవారిశాలలో వాసవాంబ, ఏరువాకగంగమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.. చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో కన్యకాపరమేశ్వరీదేవి బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు అమ్మవారిశాలలో మహాలక్ష్మీదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.






ప్రొద్దుటూరు వేంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగానూ, చెన్నకేశవస్వామి ఆలయంలో గజలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు



జమ్మలమడుగులో బాలత్రిపుర సుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి

బద్వేలుటౌన్‌లో : స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మహాలక్ష్మీదేవి ఆలయంలో గజలక్ష్మీదేవిగా, కోదండరామస్వామి దేవాలయంలో వామన అవతారంలో, దుర్గమ్మ ఆలయంలో కాత్యాయనీదేవిగా, భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీకన్యకాపరమే శ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని గురువారం డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలుచేశారు.

కొండాపురంలో: మండలంలోని దత్తాపురం పెద్దమ్మగుడిలో క్రాత్యాయనిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దువ్వూరులో: దువ్వూరులో గురువారం అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో కన్యకాపరమేశ్వరిని భక్తులు దర్శించుకున్నారు.

బ్రహ్మంగారిమఠంలో: మండలకేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

ఖాజీపేటలో: మత్యకన్యకాపరమేశ్వరీ ఆలయంలో 4వ రోజు భక్తులకు అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలసపాడులో: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



బద్వేలు అమ్మవారిశాలలో పార్వతీదేవిగా అమ్మవారు



మైదుకూరులో మహాలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు



ఎర్రగుంట్ల అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారం



దువ్వూరులో ధనలక్ష్మీదేవిగా కొలువైన అమ్మవారు



కలసపాడులో కాత్యాయనీగా అమ్మవారు



ఖాజీపేటలో గజలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు

వీడని సీజనల్ వ్యాధులు.. ఆందోళనలో ప్రజలు

● రోగులతో ప్రభుత్వాస్పత్రి కిటకిట ● చిన్నారులను వేధిస్తున్న జ్వరాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లల వార్డు వద్ద వరుసకట్టిన రోగులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన ల్ కేంద్రమైన జమ్మలమడుగును సీజనల్ వ్యాధులు వీడడంలేదు. దీంతో చిన్నా, పెద్ద అనే తేడాలే కుండా జ్వర పీడితులు ఆస్పత్రికి అధికంగా వస్తుండడంతో ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ముఖ్యంగా చిన్నారులకు జలు బు, జ్వరాలు ఎక్కువగా వస్తుండ డంతో చంటిబిడ్డలతో చిన్నపిల్లల వార్డు రద్దీగా ఉంది. గత నెల నుంచి ఇప్పటి వరకు ఆస్పత్రులలో రోగులు కిటకిటలాడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లి రోడ్లపై నిలిచిన వర్షపునీటితో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు, దోమలు అధికం అయ్యాయి. దగ్గు, జలుబు, జ్వరాలు, నొప్పులు అధికంగా ఉన్నాయని ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా తెలిపారు.

కాలుష్యం కొలిచేందుకు మిషన్లు ఏర్పాటు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు అధికమౌతున్న కాలుష్యాన్ని కొలిచేందుకు కాలుష్యనివారణ మండలి కడప వారు స్థానిక న్యూకాలనీలో కాలుష్యాన్ని కొలిచేమిషనరీని గురువారం ఏర్పాటు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి బారీగా దుమ్ముకాలుష్యం వస్తోందని అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు చేశారు. అయితే ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. స్పందించలేదు. వాటిపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కాలుష్యం ఏమోతాదులో వస్తోందో తెలుసుకునేందుకు ఈ యంత్రాన్ని న్యూకాలనీలోని మిద్దెలపై ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3గంటల వరకు కాలుష్యాన్ని కొలుస్తారు.

ఏపీ జెన్‌కో మరింత అభివృద్ధి సాధించాలి



జెన్‌కో ఎండీ నాగలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న యూనియన్ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో ఎండీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో జెన్‌కో సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్ 129 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలోని ఎండీ కార్యాలయంలో ఆయన ఎండీ నాగలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిజాయితీగల అధికారి సారధ్యంలో సంస్థలో పనిచేసే ఉద్యోగ, కార్మికులకు సమస్యలు త్వరగా పరిష్కారం అయి న్యాయం జరుగుతుందన్నారు. సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన ఎండీకి తెలిపారు. కార్మిక సమస్యలపై మరోసారి కలవాలని ఎండీ తెలిపినట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. యూనియన్ నాయకులు మోహన్‌రావు, రవి, సుబ్బారావు, వలిలు ఉన్నారు.

సుపరిపాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

● నర్సాపురం సహకార సంఘం చైర్మన్ గురివిరెడ్డి



స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న సహకార సంఘం చైర్మన్ గురివిరెడ్డి

కాశినాయన సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి) ప్రజలకు సుపరిపాలన అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నర్సాపురం వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బంగారు గురివిరెడ్డి పేర్కొన్నారు. గురువారం అమగంపల్లె, సావిశెట్టిపల్లె తదితర గ్రామాల్లో సహకార సంఘం డైరెక్టర్ మురుకూటి వేణుగోపాల్ రెడ్డితో కలిసి ప్రజలకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ఆయన పంపిణీ చేశారు. ఈసంద ర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సులభతరంగా రేషన్ పొందేలా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకొచ్చిందన్నారు.ఈకార్యక్రమంలో స్థానిక వీఆర్వోలు శ్రీనివాసులు, నరసింహులు సచివాలయ ఉద్యోగులు స్థానిక డీలర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి నాయకులచే స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ



స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి

కొండాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) స్మార్ట్ రేషన్‌కార్డులను మండలంలో గురువారం నుంచి కూటమి నాయకులు, అధికారులు పంపిణీ చేస్తున్నారు. మండలానికి 11,857 స్మార్ట్ రేషన్‌కార్డులు రాగా, వాటిని డీలర్ల ద్వారా అధికారులు, నాయకులు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని గండ్లూరు గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వర్‌రెడ్డి, కూటమి నాయకుడు గండ్లూరు శంకర్‌రెడ్డిలు స్మార్ట్‌రేషన్‌కార్డులను ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో డీలర్ కిట్టు తదితరులు పాల్గొన్నారు.

కోరంలేక మున్సిపల్ సమావేశం వాయిదా

మైదుకూరు సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): మైదుకూర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరంలేక గురువారం వాయిదా పడింది. ఉదయం 11గంటలకు జరగవలసిన సమావేశం కౌన్సిలర్లు లేక గంట ఆలస్యంగా ప్రారంభమైంది. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అద్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొదట ఇటీవల చనిపోయిన ఓ కౌన్సిలర్‌కు నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కి చెందిన ఒక కౌన్సిలర్, వైసీపీ కి చెందిన 4గురు కౌన్సిలర్లు హాజరు కావడంతో మున్సిపల్ మేనేజర్ సుబ్బరాయుడు అనివార్యకారణాల వల్ల కోరంలేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగురాళ్లపల్లె రెవెన్యూపొలం 247 సర్వేనెంబరులో భూ ఆక్రమణలను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శివకుమార్ కోరారు. ఆమేరకు మండల కమిటీ భూకబ్జాకు గురైన భూమిని పరిశీ లించారు. ఈసందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 247 సర్వేనెంబ రులో గతంలో పాపిరెడ్డిపల్లె ఎస్సీ, బీసీ కుటుంబాలకు అసైన్‌మెంటు కమిటీలో పట్టాలు సర్వే చేసి చూప కపోవడంతో రాజకీయ పలుకుబడి కలిగిన వారు ఆక్రమించే యత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

నూతన కమిటీ ఎన్నిక

జమ్మలమడుగు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బంగారు దుకాణాల వద్ద గురువారం మూమెంట్‌ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి నూతన కమిటీ ఏర్పాట్లు ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం హాజరయ్యారు. రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడుగా లియాజ్‌ఖాన్, కార్యదర్శిగా ఖాజాపీర్, కోశాధికారి మారుతీరావు, మరో 20 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు అబ్దుల్‌గని, ముక్తియార్, అల్లాబకాష్, అన్వర్, ఖాదర్‌బాష, మోహిద్దీన్, ఖలందర్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Proddatur Branch issues the following notice to the general public. My client intend to grant loan to **Angamapalle Sumalatha** W/o Baludu residing at D.No: 1/246, Chennamarajupalle Village, Proddatur Mandal YSR Kadapa Dt. by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES :** YSr Kadapa Dt. Proddatur Sub Dist Proddatur Mandal, Chennamarajupalle Village and Panchayath, Kamanuru Village field the Vacant site Situated at Sy. No. 233/B2 ti an Extent up Ac.0-10 cents in which an extent of Ac. 0-06 cents and in which an extent of Ac. 0-06 cents and 780 1/2 Sq. Links or 0.023 Hectors is bounded as follows : **BOUNDARIES:** EAST: Vacant site of Angampalle Ankal, WEST : Vacant site of Madduru Chinna Pullaiah, NORTH: 26 links width Rasta for Ingress and Egress, SOUTH : N.G.O. Plots

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

మైదుకూరు డిపోను సందర్శించిన ఆర్టీసీ ఎండీ

మైదుకూరు సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమల రావు మైదుకూరు డిపోను గురువారం సందర్శించారు. బస్టాండు పరిసరాలతో పాటు డిపోను సందర్శించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోల సందర్శనలో భాగంగా 119 డిపోగా మైదుకూరు కు వచ్చానన్నారు. స్త్రీశక్తి పథకం బాగా అమలు గతంలో 40 శాతం ప్రయాణించే స్త్రీలు 60 శాతానికి పెరిగారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో 1050 ఎలక్రిక్ బస్సులు రానున్నాయన్నారు. బస్ డిపోలలో చార్జింగ్ కోసం విద్యుదీకరణ పనులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శిదిలావస్థలో ఉన్న బస్టాండ్లను ప్రక్షాళన చేస్తామన్నారు. ఈఈ చెంగళ్‌రెడ్డి, డీపీటీ గోపాల్‌రెడ్డి, డీఎం శ్రీలతలు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో కాంట్రాక్టర్ దోపిడీ

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్ట్ అగ్రిమెంట్ ప్రకారం రూ. 18600జీతంకు గాను కాంట్రాక్టర్ 12,000 మాత్రమే చెలిస్తూ కార్మికులను దోపిడీ చేస్తున్నాడని సీఐటియూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆచారి ఆరోపించారు. గురువారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో పారిశుధ్యకార్మికులు ధర్నాచేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ రూపానంద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాఘవ, అధ్యక్షుడు రత్నమ్మ, కార్యదర్శి కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, కోశాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పక చేయించుకోవాలి

ఖాజీపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆరోగ్య పరీక్షలు తప్పక చేయించుకోవాలని గ్రంథాలయ డైరెక్టర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రావులపల్లెలో విలేజ్ హెల్త్ కేంద్రంలో స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి ఇలియారాజి, లక్ష్మిరెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు తుట్టే రాము పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు

ముద్దనూరు సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో వెంకటకృష్ణారెడ్డి పేర్నొన్నారు. యామవరం, శెట్టివారిపల్లె రైతు సేవాకేంద్రాల్లో 19.8 మెట్రిక్ టన్నుల 440 బస్తాలు యూరియా ఉందన్నారు. బస్తా ధర రూ.266.50 పైసలు అన్నారు.డీఏపీ బస్తా రూ.1400 ధర ఉన్నదని తెలిపారు.

ప్రొద్దుటూరులో ఆగని మట్కా, గుట్కా, క్రికెట్‌బెట్టింగ్

● అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చినా ప్రొద్దుటూరులో మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం నడుస్తున్నాయని కొత్తగా రిక్రూట్ అయిన డీఎస్పీలు సైతం అవినీతికి పాల్పడుతున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అసెంబ్లీలో ఆరోపించారు. గురువారం జరిగిన అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో పోలీసులను ఇంటి మనుషుల్లా వాడుకొని అన్ని రకాల అసాంఘిక నేరాలకు పాల్పడ్డారన్నారు. వైసీపీ హయాంలో అలవాటుపడిన అవినీతిని కూటమి ప్రభుత్వం వచ్చినా పోలీసులు మానలేకఉన్నారన్నారు. పోలీసుల అవినీతి మీద వారిపనితీరు మీద ఫిర్యాదు చేస్తే పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా డిపార్ట్‌మెంటువారిని వెనకేసుకొస్తున్నారన్నారన్నారు. ఇలాంటి అవినీతి పోలీసు అధికారులపై విచారణ జరపడానికి వేరే డిపార్ట్‌మెంట్ వారిని విచారణ అధికారిగా నియమించాలన్నారు.

ముఖ్యమంత్రికి నూతన ఉపాధ్యాయురాలి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే ద్వారా నియామక పత్రం అందుకుంటున్న అనసూయ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన పట్టణానికి చెందిన అట్ల అనసూయ కృతజ్ఞతలు తెలిపారు. ఎంఏ బీఈడీ చదివిన ఆమె డీఎస్సీ ద్వారా ట్రైబల్ వెల్ఫేర్ స్కూలులో టీజీటీ పోస్టుకు ఎంపికయ్యారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ద్వారా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో 48 ఏళ్ల వయస్సులో తాను కష్టపడి చదివి ఉద్యోగానికి ఎంపికయ్యానన్నారు.

విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కలలను సాకారం చేసుకుని ఉన్నత శిక్షరాలు చేరుకోవాలని రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల మొదటిసంవత్సరం విద్యార్థులకు గురువారం రాయల్‌కౌంటీలో ప్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ తరుణేందుశేఖర్, డైరెక్టర్లు అమర్‌నాథ్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాల్లో స్పెషలిస్టుల సేవలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి స్పెషలిస్టు వైద్యులచేత ఉచిత వైద్య సేవలు అందజేస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీరాముల పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని డిప్యూటి డీఎం హెచ్‌వో, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిలు ప్రారంభించారు. అక్టోబరు 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ప్రతి అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో జరుగుతాయన్నారు. టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ అఫీసర్ శ్రీనివాసులు, డీపీఎంవో శంకరయ్య సూపర్ వైజర్ రాజారత్నంలు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

బి.కోడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు సచివాలయంలో వైద్యాధికారి ఉదయకిరణ్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచితే దోమల వ్యాప్తిని అరికట్టగలుగుతామన్నారు. దోమ తెరలు వాడడం, వేపాకు పొగ వేసుకోవడం జాగ్రత్తలు పాటించాలన్నారు.

15 మద్యం బాటళ్లు స్వాధీనం

జమ్మలమడుగు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో గురువారం అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తి నుంచి పెద్దముడియం పోలీసులు 15 మద్యం బాటళ్ల స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్థులు పోలీసులకు సవాచారమివ్వడంతో మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.





